క్లుప్తంగా

తోటపల్లి పిల్లకాలువకు గండి

● పూడ్చాలని కోరుతున్న రైతులు



పిల్ల కాలువకు గండి పడడంతో పొలాల్లోకి ప్రవహిస్తున్న సాగునీరు

తెర్లాం: తోటపల్లి ప్రధాన కుడికాలువ నుంచి ఆమిటి మీదుగా ఉన్న పిల్ల కాలువకు (వంతరాం డిస్ట్రిబ్యూటరీ కెనాల్) సోమవారం గండి పడింది. దీంతో సాగునీరు వృథాగా పంట పొలాల్లోకి ప్రవహిస్తోంది. పొలాల్లో నీరు ఎక్కువగా చేరడంతో వరి ఎదలు వేసుకోలేక పోతున్నామని ఆమిటి గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి తోటపల్లి పిల్ల కాలువ ద్వారా సంబంధిత అధికారులు ఇటీవల సాగునీరు విడుదల చేశారు. అయితే పిల్లకాలువకు ఇరువైపులా ఉన్న గట్లు బలంగా లేకపోవడంతో కొన్నిచోట్ల గండ్లు పడడం.. మరికొన్ని చోట్ల పిల్ల కాలువకు లీకులు ఏర్పడ్డాయి. అధికారులు స్పందించి గండి పూడ్చడంతో పాటు లీకులను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రాజేశ్వరి

బాడంగి: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు ఎంఈఓ ఎం. రాజేశ్వరి తెలిపారు. మండలంలోని కోడూరు బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యతో పాటు జగనన్న విద్యాకానుక, మధ్యాహ్న భోజనం, అమ్మఒడి, తదితర ఎన్నో సదుపాయాలు కల్పిస్తోందని చెప్పారు. సమావేశంలో హెచ్‌ఎం మధుసూదనరావు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కల్పించండి

మెంటాడ: మండలంలోని ఆగూరు రెవెన్యూ పంచాయతీ పరిధిలోని సంగంగుడ్డివలస గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు.

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వినియోగించుకోండి..


● ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి



మాట్లాడుతున్న ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి

తెర్లాం: గ్రామాల్లోని అన్ని వర్గాల ప్రజలు, రైతులు, విద్యార్థులకు అవసరమైన 11 రకాల ధ్రువపత్రాల మంజూరు చేయడంతో పాటు అర్హత ఉండి ఇంకా అందని సంక్షేమ పథకాలు మంజూరుకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అన్నారు. మండలంలోని పణుకువలస, తదితర గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంపై సోమవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కార్యక్రమాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయండి



లోచర్ల హైస్కూల్‌లో నాడు - నేడు పనులను పరిశీలిస్తున్న బొబ్బిలి డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు

తెర్లాం: బొబ్బిలి డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న మనబడి నాడు - నేడు పథకం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని బొబ్బిలి డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు అన్నారు. మండలంలోని లోచర్లతో పాటు మరికొన్ని పాఠశాలల్లో జరుగుతున్న నాడు - నేడు పనులను సోమవారం ఆయన పరిశీలించారు. గడువు లోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. అనంతరం లోచర్లలో తలిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఆయన వెంట ఎంఈఓ - 2 పాపారావు, లోచర్ల హైస్కూల్ హెచ్‌ఎం పద్మజారాణి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉన్నారు.

ప్రతి ఇంటా సంతోషం..

● ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు
● రామభద్రపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



రామభద్రపురం మెయిన్‌రోడ్డులో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, తదితరులు

రామభద్రపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటా సంతోషి వెల్లివిరుస్తోందని, సంక్షేమ పథకాల ఆర్థిక సాయం నేరుగా లబ్ధిదారులు బ్యాంక్ ఖాతాలకు జమవుతోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డు, చేపల మార్కెట్ వద్ద ఉన్న కూరాకుల వీధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే పథకాల వల్ల ఒక్కో ఇంటికి కలిగిన లబ్ధిని తెలియజేస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఇళ్ల పట్టాలు, తాగునీరు, తదితర సమస్యలు తెలియజేయగా.. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జగనన్న బాటలోనే అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా తామంతా ముందుకు సాగుతున్నామన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రీ అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను మన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను సైతం అమలు చేసిన ఘనత సీఎం జగనన్నకు దక్కుతుందని చెప్పారు. జగనన్న మరో 30 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉంటే ప్రతి ఇల్లూ సంక్షేమ పథకాలతో కళకళలాడుతుందన్నారు. టీడీపీ హయాంలో అప్పటి పాలకులు ఎన్నికలప్పుడు మాత్రమే కనిపించేవారని.. తాము మాత్రం నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, వైఎస్సార్‌సీపీ బొబ్బిలి మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, జేసీఎస్ మండల కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, నాగిరెడ్డి కామేశ్వరరావు, దితరులు పాల్గొన్నారు.

ప్రతిఇంటా 'సంక్షేమ' కాంతులు: ఎమ్మెల్యే జోగులు



రాజాం: ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతిఇంటా సంక్షేమ కాంతులు నెలకొన్నాయని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. సోమవారం స్థానిక పట్టణ పరిధిలోని సారధి గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రతీ ఇంటికి లబ్ధి చేకూరేలా ఆయన పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. ఈ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. టీడీపీ హయాంలో ఏదైనా పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా జన్మభూమి కమిటీల సిఫార్సుల మేరకే వచ్చేవన్నారు. ఇప్పుడు అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందించడం జరుగుతోందన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న జగనన్న సర్కారుపై టీడీపీ, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలతో దుష్ప్రచారం చేస్తోందని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. నాడు-నేడు పథకం పేరిట పాఠశాలలు, ఆస్పత్రులను కూడా ఆధునీకరించారని, ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేయడం జరుగుతోందన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీనే గెలిపించాలని, సీఎం జగనన్ననే మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు, పి.లక్ష్మణరావు, డి.గోపాలం, కె.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో విజయవంతం..



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంజనేయులు

బాడంగి: వచ్చే నెల ఒకటో తేదీ నుంచి నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఆంజనేయులు కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల సేవలు అందించనున్నట్లు చెప్పారు. ప్రజలందరూ వినియోగించుకునేలా ప్రజాప్రతినిధులు చూడాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, వైస్ ఎంపీపీ సంగిరెడ్డి భాస్కరరావు, తహసీల్దార్ అజురఫీజాన్, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి పైపులు తొలగించాలి

● సాక్షి కథనానికి స్పందన



పశువుల ఆస్పత్రి ఆవరణలో తొలగించిన పైప్‌లైన్

రామభద్రపురం: మండల కేంద్రంలోని ఓ వ్యాపారి తన అపార్ట్‌మెంట్ నుంచి బయటకు పోవాల్సిన మురుగునీటిని పెద్ద పెద్ద పైపులతో పశువుల ఆస్పత్రి ఆవరణలోకి మళ్లించేస్తున్నారు. ఈ వ్యవహారంపై 'పశువుల ఆస్పత్రిలోకి మురుగు' శీర్షికన సాక్షిలో ఈనెల 25న కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి సోమవారం మురుగునీటి పైపులు తొలగించారు. సమస్య పరిష్కారం కావడంతో పశు వైద్యాధికారి హిరణ్య, వెటర్నరీ అసిస్టెంట్ రమ్య, తదితరులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు లక్ష్య సాధనపై దృష్టిసారించాలి



రాజాం సిటీ: మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబు

రాజాం సిటీ: విద్యార్థులు తమ లక్ష్య సాధనపై దృష్టిసారించి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు ఆకాంక్షించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు, యువత పాత్ర కీలకమన్నారు. చెడుసావాసాలకు గురై, మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దని హితవుపలికారు. విద్యార్థుల నడవడికపై తల్లిదండ్రులు దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, న్యాయవాదులు ఆర్.విజయ్ కుమార్, సీహెచ్ శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: యువత సన్మార్గాన్ని అలవర్చుకుని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఈబీ సీఐ బి.శ్రీధర్ సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, మాదకద్రవ్యాలు తీసుకోవడం కలిగే అనర్థాలను వివరించారు. గంజాయి, హెరాయిన్, నల్లమందు వంటి మత్తుపదార్థాలు ఆరోగ్యానికి హానికరమని, అతి చిన్న వయసులో ఎంతోమంది చెడు అలవాట్లకు బానిసలై, జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు కె.సాయి ప్రశాంత్‌కుమార్, పి.చైతన్యకుమార్, ఎస్‌ఈబీ ఎస్‌ఐ పిచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ

బాడంగి: మండలంలోని కామన్నవలస గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి పి.అమరేశ్వర్ జనరల్‌నాలెడ్జ్, ఇంగ్లిష్, ఆధ్యాత్మిక పుస్తకాలను స్థానిక శాఖా గ్రంథాలయానికి సోమవారం వితరణగా అందజేశారు. విద్యార్థులకు ఉపయోగపడే సుమారు 25 పుస్తకాలను అమరేశ్వర్ అందజేసినట్లు గ్రంథాలయాధికారి ఆర్. దుర్గాప్రసాద్ తెలిపారు.

సర్వే పరిశీలన



చీకటిపేటలో జగనన్న సురక్ష సర్వేను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రత్నకుమార్

తెర్లాం: మండలంలోని చీకటిపేటలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తహసీల్దార్ డి. రత్నకుమార్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 11 రకాల సేవలు ఉచితంగా అందజేస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కనీస వేతనాలు లేక ఇబ్బందులు

రామభద్రపురం: కనీస వేతనాలు లేక పారిశుద్ధ్య కార్మికులు ఇబ్బంది పడుతున్నారని సీఐటీయూ నాయకుడు బలస శ్రీనివాసరావు అన్నారు. ప్రభుత్వ జీఓ ప్రకారం కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కనీస వేతనం పది వేల రూపాయలు ఇవ్వడంతో పాటు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని వినతిలో పేర్కొన్నారు. ఆయన వెంట పారిశుద్ధ్య కార్మిక సంఘ సభ్యులు కారంగి భవానీ, కారంగి శ్యామల, కె. కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

సాంబయ్య మృతి పార్టీకి తీరని లోటు

● ఎమ్మెల్యే శంబంగి



సాంబయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

తెర్లాం: మండలంలోని అప్పలంపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వారాడ సాంబయ్య మృతి పార్టీకి తీరని లోటని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సాంబయ్య ఆదివారం సాయంత్రం మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం ఉదయం గ్రామానికి చేరుకుని నివాళులర్పించారు. ఆయనతో పాటు వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'జగనన్న సురక్ష'



మాట్లాడుతున్న జేసీఎస్ మండల కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు

రామభద్రపురం: మండలంలోని జూలై 1వ తేదీ నుంచి నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జేసీఎస్ మండల కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు అన్నారు. మండలంలోని రొంపల్లి సచివాలయంలో వలంటీర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్యక్రమం విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, పువ్వల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు



రాజాం: జగనన్న సురక్ష సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం: జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమంను సక్రమంగా అమలు చేయాలని వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు సూచించారు. సోమవారం మండలంలోని పొగిరి గ్రామంలో జూలై 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమ నిర్వహణపై చర్చించారు. పొగిరి, అంతకాపల్లి పంచాయతీల్లో తొలి విడత కింద ఈ కార్యక్రమం జరుగుతుందని, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, అర్హులై ఉండి పథకాలు అందని వారి వివరాలతో పాటు జనన, మరణ, కుల, ఆదాయం వంటి ధ్రువీకరణ పత్రాలు కావాల్సిన వారి వివరాలను సేకరించాలని తెలిపారు. అనంతరం అవి వారికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బి. నర్సింహులు, వైస్ ఎంపీపీ వై.వెంకటేష్, పీఏసీఎస్ చైర్మన్ వి.చిన్నంనాయుడు, సర్పంచ్ పి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రాజాం: జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమంలో భాగంగా మండలంలో పొగిరి, అంతకాపల్లి గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టి, అర్హులై ఉండి, ప్రభుత్వ పథకాలు అందని వారి వివరాలు, జనన, మరణ, కుల, ఆదాయం వంటి ధ్రువీకరణ పత్రాలు కావాల్సిన వారి వివరాలను వలంటీర్లు సేకరించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీఓ శంకరరావు పరిశీలించారు.

సంక్షిప్తంగా...

బాధ్యతాయుతంగా పనిచేయాలి

తెర్లాం: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో యోగా ఉపాధ్యాయులుగా నియమితులైన వారంతా బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎంఈఓ జె.త్రినాథరావు అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ వద్ద యోగా ఉపాధ్యాయులకు నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలల్లో నిర్దేశించిన సమయంలో విద్యార్థులకు యోగా నేర్పించాలన్నారు.

సకాలంలో పరిష్కారం

తెర్లాం: జగనన్నకి చెబుదాం (స్పందన) కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యలను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకి చెబుదాం కార్యక్రమం నిర్వహించి పలువురి నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ అప్పయ్య, అధికారులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతుల్లో వరిసాగు

రాజాం: యాజమాన్య పద్ధతుల్లో వరి పంటను సాగుచేయాలని, ఇలా చేయడం ద్వారా అధిక లాభాలు వస్తాయని అగ్రికల్చర్ రాజాం ఏఓ రేణుకాసాయి తెలిపారు. సోమవారం మండలంలోని గడిముడిదాం గ్రామంలో ఫెర్టికమ్ సీడ్ డ్రిల్ యంత్రాన్ని వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు చేతులమీదుగా రైతులకు అందజేశారు. అనంతరం యంత్రాన్ని ప్రారంభించి, వరి ఎదలు పొలంలో చల్లారు. ఏఓ మాట్లాడుతూ మండలంలో ట్రాక్టర్ ఉన్న రైతులకు గ్రామాల వారీగా ఈ యంత్రాన్ని పైడిభీమవరం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఉచితంగా అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ పీఎల్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

రేగిడి: ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా నాగమణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహన్‌రావు అభినందనలు తెలిపారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన కాశీవిశ్వనాథరావు బదిలీపై అనకాపల్లి వెళ్లగా, ఆయన స్థానంలో రాజాం ఎంపీడీఓ శంకరరావును ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు చేపట్టారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

రాజాం సిటీ: స్థానిక పట్టణంలోని శ్రీఆంజనేయ, సాయిరాం ట్రేడర్స్‌కు చెందిన ఎరువుల దుకాణాల్లో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చీపురుపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.కోటేశ్వరరావు ఎరువుల స్టాక్ రికార్డులు పరిశీలించి, నిబంధనల మేర నాణ్యమైన ఎరువులు, విత్తనాలను విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ఎం.రేణుకాసాయి, ఏఎస్ఐ ఎ.లక్షుంనాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లిలో రూ.15 లక్షల 15వ ఆర్థిక సంఘ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ రమాదేవి, కౌన్సిలర్ కాకల గోవిందమ్మ, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ తుట్ట తిరుపతి, కోఆప్షన్ మెంబర్ తెర్లి సత్యనారాయణ, దమ్మా అప్పారావు, మాజీ కౌన్సిలర్ కాకల వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఈకేవైసీ నమోదు

రేగిడి: జగనన్న అమ్మఒడి పథకానికి సంబంధించి, మండలంలోని వన్నలి, వండానపేట, చాటాయివలస, బూరాడ, కొమెర, రేగిడి, సంకిలి తదితర గ్రామాల్లో ఈకేవైసీ నమోదు చాలా చురుగ్గా జరుగుతోంది. వలంటీర్లు లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి, ఈకేవైసీ చేస్తున్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించండి

వంగర: గ్రామాల్లో నెలకొన్న ప్రజాసమస్యలు పరిష్కరించాలని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహించి, ప్రజావినతుల పరిష్కారంపై చర్చించారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలు సకాలంలో పరిష్కారమయ్యేలా చూడాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి..

రామభద్రపురం: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ మహరాజన్ అన్నారు. ఈ నెల 25న 'నాసిరకం విత్తనాలతో జాగ్రత్త..' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించి ఏఓ వెంకటయ్య, ఏఎస్సై రమణలతో కలిసి మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాలు విక్రయించే దుకాణాలను సోమవారం తనిఖీ చేశారు. మన గ్రోమోర్ దుకాణంలో విక్రయిస్తున్న పత్తి విత్తనాలకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో పత్తి విత్తనాల విక్రయాలు తాత్కాలికంగా నిలిపివేశారు. అనంతరం ఏడీఏ మహరాజన్ మాట్లాడుతూ, నాసిరకం విత్తనాలు విక్రయిస్తే దుకాణ యజమానులపై 6ఏ, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ లోకేష్, వీఏఏ కొండలరావు ఉన్నారు.

చేపల పెంపకంపై శిక్షణ

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామంలో చేపల పెంపకంపై మత్స్యకారులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. సర్పంచ్ మొయిద శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇండియన్ ఫిషరీస్ కార్పొరేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు కొనసాగే ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రిసోర్సు పర్సన్ జి.వెంకటేశ్వరరావు ప్రభుత్వం మత్స్యకారులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి

రేగిడి: ఏదైనా పాఠశాలలో చదివి, ఉన్నత స్థానాల్లో స్థిరపడిన వారు ఆ పాఠశాల అభివృద్ధికి సహకరించాలని ఎంఈఓలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్య కోరారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జగనన్న గోరుముద్ద పథకం అమలు సక్రమంగా ఉండాలంటే ప్రతిరోజూ విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు పాఠశాలలో భోజనం చేయాలని తెలిపారు.

తనిఖీలు

బొబ్బిలి: పట్టణంలోని పాత బొబ్బిలి ధనలక్ష్మి ఫెర్టిలైజర్స్ షాపును వ్యవసాయశాఖ ఏడీఏ కె. మహరాజన్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు సక్రమంగా లేకపోవడంతో రూ. 16,250 విలువైన వరి విత్తనాల విక్రయాలను నిలుపుదల చేశారు. అలాగే ఆదిత్య జనరల్ స్టోర్‌ను పరిశీలించారు. రికార్డుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ 43,765 రూపాయల విలువైన విత్తన విక్రయాలను నిలిపివేశారు. ఆయనతో పాటు ఎ.డి మజ్జి శ్యామ్‌సుందరరావు, వ్యవసాయ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

బొబ్బిలి: మాదకద్రవ్యాల వినియోగం, రవాణాకు వ్యతిరేకంగా ఎస్‌ఈబీ సీఐ ఆర్. జైభీమ్ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఎస్‌ఈబీ స్టేషన్, కాలేజ్ రోడ్ల మీదుగా ర్యాలీ నిర్వహించి ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. పలు కళాశాలల విద్యార్థులు, ఎస్‌ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.